పంటను పరిశీలించిన ఒడిశా రైతులు



షాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఒడిశా రైతులు రాజేంద్రనగర్ భారతీయ నూనె గింజల సంస్థలో ఐదు రోజులుగా శిక్షణ పొందుతున్నారు. మంగళవారం సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిర్మలాపూర్‌లో రైతులు సాగుచేస్తున్న కుసుమ పంటను పరిశీలించారు. సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో కలిసి అధికారులు మంగళవారం ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. సుల్తాన్‌పల్లిలో లబ్ధిదారులకు నిర్మాణంపై అవగాహన కల్పించారు. హౌసింగ్ శాఖ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాలు ప్రారంభించాలి

శంకర్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్, హౌసింగ్ డీఈ దస్తగిరి అన్నారు. ఏర్వగూడలో అధికారులు లబ్ధిదారులతో మాట్లాడారు. బేస్మెంట్ నుంచి స్లాబ్ వరకు విడతలవారీగా బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

నెర్రెలు బారిన రోడ్డుకు మరమ్మతులు



నూతనంగా వేసిన రోడ్డు

- హర్షం వ్యక్తం చేస్తున్న వాహన చోదకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

5

నేడు మహాశివరాత్రి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతిహాసాలను ప్రదర్శించే నాటకాలు ఏర్పాటు చేశారు. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయం, కీసరగుట్ట రామలింగేశ్వరాలయం, నందివనపర్తిలోని నందీశ్వరాలయం, మైడిగండిలోని శివరామాలయం, వికారాబాద్ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, తాండూరు భూకైలాసాలయం, అత్వెల్లిలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఫిబ్రవరి 25



కాంతులీనుతున్న మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయం

శివోహం!

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు.. ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ఆమనగల్లులో పండ్ల కొనుగోళ్లు

పండ్ల ధరలు పైపైకి..

- ప్రత్యేకంగా వెలసిన దుకాణాలు
- ధరలకు రెక్కలు.. కొనుగోలుదారుల బెంబేలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పండ్లు, పూల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. దీనికితోడు పట్టణాల్లో పదుల సంఖ్యలో కొత్త దుకాణాలు వెలిశాయి. శివరాత్రి పర్వదినాన భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేసి సాయంత్రం పండ్లతో దీక్షలను విరమిస్తారు. ఇదే అదునుగా టెంట్లు వేసి మరీ పండ్ల అమ్మకాలను చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక ధరలకు పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవల ద్రాక్ష పండ్లు కిలో రూ.80 అమ్మగా పండగ సందర్భంగా రూ.120 నుంచి 160కి పెంచారు. కర్బూజ రూ.60 నుంచి రూ.70, పుచ్చకాయ కిలో రూ.40 నుంచి రూ.50, బత్తాయి రూ.25 నుంచి రూ.30 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండే అరటిపండ్లు సైతం రూ.50 నుంచి రూ.80కు పెంచారు. ఖర్జూర కిలో రూ.100 నుంచి రూ.120, సపోట కిలో రూ.25 నుంచి రూ.30, జామకాయలు కిలో రూ.60 నుంచి రూ.80 చొప్పున, యాపిల్ ఒకటి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. పండుగకోసం ప్రత్యేకంగా వెలసిన దుకాణాల్లో ధరలు తక్కువగా ఉంటాయని ఊహించి అక్కడికి వెళ్తే ధరలు ఆకాశన్నంటుతున్నాయి.

పూల ధరలకు రెక్కలు



పండుగలు వస్తే చాలు పూల ధరలకు సైతం రెక్కలు వస్తాయి. నేడు మహాశివరాత్రి నేపథ్యంలో ఎప్పుడూ మూర మల్లెపువ్వులు, కనకంబరాలు రూ.15లకు ఇచ్చేది దాన్ని అమాంతంగా రూ.30కు పెంచేశారు. చామంతి పది రూపాయలకు ఇచ్చే వ్యాపారులు ఇప్పుడు ఇరవై రూపాయలకు పెంచి విక్రయిస్తున్నారు.



దేదీప్యమానంగా వెలుగుతున్న కీసరగుట్ట రామలింగేశ్వరాలయం

కల్యాణం.. కమనీయం

కనులపండువగా శ్రీరామలింగేశ్వరుడి పరిణయం



కల్యాణోత్సవంలో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి దంపతులు

- ఘనంగా స్వామివారి పల్లకీ సేవ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం
- కీసరగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కీసర, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని భవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు మంగళవారం మాఘ బహుళ ద్వాదశి పురస్కరించుకొని, శ్రవణ నక్షత్రయుక్త తుల లగ్నమందు స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరై ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. అంతకు ముందు ఉత్సవ సేవల్లో భాగంగా ఉదయం స్వామివారికి శ్రీ మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆనంతరం యాగశాలలో గణపతిశర్మ ఆధ్వర్యంలో రుద్రస్వాహాకార హోమం, జ్వాలార్చన, ప్రదోషకాల పూజ, హారతి, మంత్రిపుష్పం, పరాకస్తం నిర్వహించారు.

నందివాహనంపై స్వామివారు

బ్రహ్మోత్సవాలో మొదటి రోజు స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరగుట్ట నుంచి కీసరకు తీసుకురాగా, రెండోరోజు మంగళవారం వంశపారంపర్యస్తుల ఇంటి నుంచి నందివాహనం మీద, పల్లకీ సేవల్లో స్వామివారు ఊరేగింపుగా కీసరగుట్టకు బయలుదేరాడు. మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాన్ని స్వంగసుందరంగా ముస్తాబు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా తమిళుల రాక



ఎడ్లబండిపై వస్తున్న తమిళులు

శివరాత్రి ఉత్సవాల్లో తమిళులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. బ్రహ్మోత్సవాలల్లో భాగంగా కీసరలోని పోచమ్మ దేవాలయంలో యాప్రాల్, అమ్ముగూడ, సైనిక్‌పురి, ఈసీఐఎల్, లాల్‌బజార్, రిసాలబజార్, అల్వాల్, తిరుమలగిరి తదితర ప్రాంతాలలో ఉండే తమిళులు గ్రామదేవతకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నేటికీ వారు ఎడ్లబండ్లలో వచ్చే ఆచారం, సంస్కృతి, సంప్రాదాయం పాటిస్తుండటం గమనార్హం. అలాగే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విద్యార్థులకు క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలిచిన టీమ్‌లకు బ్రహ్మోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తారు. గుట్టపై ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు-షాద్‌నగర్ రహదారి విస్తరణలో భాగంగా ఆమనగల్లులో రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి సందబావి వరకు చేసే రోడ్డు పనులకు స్థానికులు సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ప్రజల, ప్రయాణికుల సౌకర్యార్థం చేపడుతున్న రోడ్డు విస్తరణతో ఇళ్లు కోల్పోయే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఆమనగల్లు మున్సిపల్ ఆఫీసులో మంగళవారం రోడ్డు విస్తరణపై అధికారులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. రోడ్డు విస్తరణలో తమకు అన్యాయం జరుగకుండా చూడాలని ఎమ్మెల్యేను ఈ రోడ్డు వెంట ఉన్న 82కుటుంబాల వారు కోరారు. వెడల్పు 60ఫీట్లు కాకుండా 50 ఫీట్లకు తగ్గించాలన్నారు. స్థానికుల విన్నపం మేరకు 50ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఏఈ రవితేజ, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌లకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్టణాల, గ్రామీణ రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఇందుకు ప్రజలంతా కలిసి రావాలని కోరారు. రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని, ఇప్పటికైనా త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ లలిత, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, నాయకులు గుర్రం కేశవులు, అనితవిజయ్, వస్పుల శ్రీశైలం, జగన్, మానయ్య, కృష్ణానాయక్, ఎ.శ్రీను, రజాక్, బాబ, పరమేశ్, ఖాదర్‌ఖాద్రీ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయానికి నేడు స్పీకర్ రాక

తలకొండపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తలకొండపల్లి మండలం చెన్నారం మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శిస్తారని ఆలయ గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురెడ్డి, ఆలయ నిర్వాహకుడు కల్లు పెంటారెడ్డి, ఆలయ అధ్యక్షుడు మాకం పాండయ్య మంగళవారం తెలిపారు. ఆలయంలో నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివపార్వతుల కల్యాణంలో ప్రసాద్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరవుతారని పాండురంగారెడ్డి తెలిపారు. ప్రజలు, భక్తులు తరలిరావాలని కోరారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

ఒత్తిడికి లోనవకుండా చదువుకోవాలి

- షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

కేశంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అంటేనే బోర్డ్ ఎగ్జామ్స్ అని, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురిఅవుతున్నారని, ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి సూచించారు. మంగళవారం కేశంపేట సమీప పాటిగడ్డ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. టెన్త్ విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షల ముందు ఒత్తిడికి గురికావొద్దన్నారు. పరీక్షలంటే భయపడొద్దని, పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తెల్లవారుజామునే కాలకృత్యాలు తీర్చుకొని యోగాసనాలు చేయాలన్నారు. ఎండలో ఎక్కువగా తిరగొద్దని తెలిపారు. విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని కేజీబీవీ స్పెషలాఫీసర్ గౌసియాబేగంకు సూచించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని డాక్టర్ నిఖితను ఆదేశించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులివ్వాలన్నారు. ఆమె వెంట హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఈవోలు నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఏఎన్ఎం పార్వతి ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

కొత్తూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు అన్నారు. కొత్తూర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. పోచమ్మ ఆలయం వద్ద బీఆర్ఎస్ నాయకుడు బాతుక దేవేందర్‌యాదవ్, హనుమాన్ ఆలయం వద్ద తాండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మైసమ్మ ఆలయం వద్ద సామాజిక సేవ యువ నాయకుడు కె.శివచారి, ఎస్సీ వాడ వద్ద బీఆర్ఎస్ నాయకుడు యాదయ్య సొంత ఖర్చుతో కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఈ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు జి.శ్రీనివాస్, మురళీగౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు కడెంపల్లి సదానంద్ గౌడ్, కృష్ణ, యాదగిరిచారి, రవినాయక్, శ్రవణ్‌కుమార్, బాల్‌రాజ్, సాగర్, సురేష్, రాఘవేందర్‌యాదవ్, బాలు, సాయిచారి పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీదేవి డోలారోహణం


ఉత్సవమూర్తులతో నిర్వాహకులు డాక్టర్ ముద్ద భక్తవత్సలం దంపతులు


డోలారోహణం నిర్వహిస్తున్న అక్కమహాదేవి మహిళా సమాజం సభ్యులు

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అగ్నిగుండం ప్రజ్వలనం, స్వామి వారి పల్లకీసేవ, జగజ్జననీ పార్వతీదేవి జన్మదినోత్సవం, డోలారోహణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ వేద పండితుడు మఠపతి సాంబశివశర్మ, ఆలయ అర్చకుడు బస్వరాజస్వామి ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. రాత్రి భవనం నుంచి మహాశక్తి చౌరస్తా వరకు ఉత్సవమూర్తులతో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ముద్ద దీపా, డాక్టర్ ముద్ద భక్తవత్సలం, ఆలంపల్లి చంద్రశేఖరస్వామి, నాగేశంస్వామి, శివశంకర్, శ్రీకాంత్, కోటిలింగం, వీరశైవ సమాజం, అక్కమహాదేవి మహిళా మండలి, బసవ యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టరపట్టు హైలెస్సా



వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సులకు కేరాఫ్ అడ్రస్‌గా వికారాబాద్ బస్ డిపో నిలుస్తుంది. ఎప్పుడూ ఏ బస్సు ఆగుతుందో తెలియక డ్రైవర్లు కండక్టర్లు బిక్కుబిక్కుమంటూనే బస్సులు రోడ్లపై తీసుకపోతున్నారు. బస్సులు ఎక్కడపడితే అక్కడ మురాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మంగళవారం రాత్రి వికారాబాద్‌లో బస్సు మోరాయించడంతో కండక్టర్ పట్టణ ప్రజల సహకారంతో బస్సు తోయడం కనిపించింది. ఇది చూసినవారు శివ శివ ఇదేం తీరు అన్నట్లుగా మాట్లాడుకోవడం వినిపించింది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 2025 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచేందుకు ఆర్బీఐ సూచనల మేరకు మంగళవారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 2కె వాక్‌ను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రవతి, జిల్లా సంక్షేమాధికారి సాంబశివరావు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల దుర్మరణం


చంద్రశేఖర్(ఫైల్)


మత్స్యగిరి(ఫైల్)

కీసర రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ప్రమాద స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. ఈ ఘటన సోమవారం రాత్రి మేడ్చల్ జిల్లా కీసర మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రహీంఖాన్‌గూడకు చెందిన గూడూరు చంద్రశేఖర్(32), అతడి తమ్ముడు మత్స్యగిరి(27) ఉపాధి కోసం నగరానికి వలసొచ్చారు. చంద్రశేఖర్ దర్జీ పని చేసుకుంటూ తార్నాకలో, మత్స్యగిరి విజయ డెయిరీలో ఉద్యోగం చేసుకుంటూ లాలాగూడలో ఉంటున్నారు. సోమవారం వీరిద్దరు, తమ అల్లుడు శ్రీనుతో కలిసి ముగ్గురు తమ ద్విచక్రవాహనంపైన దమ్మాయిగూడ మున్సిపాలిటీ యాద్గార్‌పల్లిలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. పని ముగించుకుని తిరిగి వస్తూ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు గుండా యాద్గార్‌పల్లి-చీర్యాల ప్రాంతానికి చేరుకున్నారు. ఎదురుగా వచ్చిన కారు(థార్) వేగంగా వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురూ రోడ్డుపైన పడిపోయారు. తీవ్రగాయాలతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మత్స్యగిరి, శ్రీనులను గాంధీ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మత్స్యగిరి చనిపోయాడు. శ్రీను చికిత్స పొందుతున్నాడు. మృతులిద్దరూ తోడబుట్టిన అన్నదమ్ములు. కాగా మత్స్యగిరి పెళ్లి వచ్చే నెల 20న జరగాల్సి ఉంది. చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు


పీర్ మహ్మద్, నిందితుడు

పరిగి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటాకోసం ఓ కొడుకు కన్న తండ్రిని కొట్టి చంపిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎండీ రహీం(72)కు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం. రహీంతో భూమి వాటా విషయంలో చిన్న కొడుకు పీర్‌మహ్మద్ గొడవపడుతున్నాడు. సోమవారం రాత్రి పీర్‌మహ్మద్ పనిచేసే ఫామ్‌హౌజ్‌లో తండ్రితో గొడవపడగా గ్రామస్తుడు వారిని వారించి ఇంటికి పంపించాడు. మంగళవారం ఉదయం ఇంట్లో పీర్‌మహ్మద్ మరోసారి తండ్రిని కట్టెలతో కొట్టాడు. తీవ్ర గాయాలైన రహీంను భార్య పర్వీన్‌బేగం, పెద్ద కొడుకు పాషా పరిగి అస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా రహీం చనిపోయాడు. రహీం చెల్లెలు కరీమాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పీర్ మహ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

జాఫర్‌పల్లిలో నవోదయం

కేంద్ర మంత్రికి బీసీ సంఘం నేతల వినతి

జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు

పరిగి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం జాఫర్‌పల్లి గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర విద్యాశాఖ పరిశీలిస్తున్నది. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన జాఫర్‌పల్లిలో కేంద్ర జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి ఇటీవల వినతిపత్రం అందజేశారు. ఈ విజ్ఞప్తి మేరకు కేంద్రవిద్యశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ జాఫర్‌పల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర విద్యశాఖ ఉన్నత అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు కేంద్రమంత్రి తిరిగి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, లాల్‌కృష్ణప్రసాద్‌లకు మంగళవారం తిరిగి లేఖ ద్వారా సమాచారం అందించారు. తెలంగాణంలో ఇప్పటివరకు పాత పది జిల్లాల్లో పది విద్యాలయాలు కొనసాగుతున్నాయి. నెల క్రితం ఆరు విద్యాలయాల ఏర్పాటుకు మంజూరు ఇచ్చింది. కొత్తగా పరిగి మండలం జాఫర్‌పల్లిలో కూడా జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. జాఫర్‌పల్లి పూర్తిగా గ్రామీణ ప్రాంతమని, ఇక్కడ ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ విద్యా సంస్థ ఏర్పాటుకు ఆర్ కృష్ణయ్యతో కలిసి మరోసారి కేంద్రమంత్రిని కలుస్తామని పేర్కొన్నారు.

త్రివేణి సంగమంలో చీఫ్ విప్ దంపతులు



త్రివేణి సంగమంలో స్నానం ఆచరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ కుంభమేళలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సునితారెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగరాజ్‌లోని గంగ, యమున, సరస్వతి నదుల సంగమం త్రివేణిలో పవిత్ర స్నానాన్ని ఆచరించి సూర్యనమస్కారాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్వీ రమణారెడ్డి, చాముండేశ్వరి, కూతురు మనీషా రెడ్డి, అల్లుడు హిమదిప్‌రెడ్డి ఉన్నారు.

డబుల్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే పూర్తి చేసి అర్హులైన పేదలకు, కార్మికులకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని త్వరగా పూర్తి చేసి పేదలకు పంపిణీ చేయాలన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో, రూరల్ గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, అర్హులైన పేదలకు, కార్మికులకు స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రతి పేదవారికి స్థలం కేటాయించే వరకు సీపీఎం పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎరుకల సత్యనారాయణ, మద్దులపల్లి సుదర్శన్, నాయకులు జోగు లాలయ్య, హరిజన్ లక్ష్మయ్య, బిల్లపాటి యాదయ్య, చిట్టింపల్లి ఏళ్లయ, కన్నా, నర్సింహారెడ్డి, బసిర్, జహంగీర్ పాల్గొన్నారు.


రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం



కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో కోత్వాల్‌గూడ, శంషాబాద్ మండలంలోని వివిధ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కార్తీక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని, రైతులకు రుణమాఫీ, పింఛన్, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందన్నారు. బీఆర్ఎస్‌లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం బీఆర్ఎస్ అధికారంలో వస్తోందని, కార్యకర్తలు సైనికుల్లా పని చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటి చరణ్, మాణిక్‌రెడ్డి, బాలు, శ్రీనివాస్, శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ కమిటీల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య సేవలపై ఆరా



వైద్య సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య అదనపు సంచాలకులు పుష్ప

వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య అదనపు సంచాలకులు డాక్టర్ పుష్ప వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం రిజిస్టరైన ప్రైవేట్ ఆస్పత్రుల పనితీరు గురించి చర్చించారు. వికారాబాద్ పట్టణంలోని ఇషా హాస్పిటల్, అనంత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడిక్యూర్ ఆసుపత్రులను పరిశీలించి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నిబంధనల అమలుపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో పేషెంట్లకు, వారి అటెండెంట్‌లకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జీవరాజ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, సిబ్బంది సునీల్ రాజ్, అనిల్, నిరంజన్ రావు, వెంకట్ రామ్ రెడ్డి, రమావాణి పాల్గొన్నారు.

మహా వేడుకలకు ముస్తాబు

- శివ నామస్మరణతో మార్మోగుతున్న శైవక్షేత్రాలు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి
- నిత్య పూజలతోపాటు ప్రత్యేక కార్యక్రమాలు

మహా శివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి సందర్భంగా ఊరూ వాడా ఆధ్యాత్మికతను సంతరించుకోనుంది. ప్రముఖ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడకల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తుల జాగరణ, భజనలు, ప్రత్యేక కార్యక్రమాలతో ఆలయాలు శోభిల్లనున్నాయి.



మునులు నడయాడిన నేల.. మల్లప్పగుట్ట

తలకొండపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నారం గ్రామ సమీపంలో మల్లప్పగుట్టపై వెలసిన మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మునులు ఇక్కడ తపస్సు చేసిన ఆనవాళ్లు కన్పిస్తాయి. వేసవిలో గుట్టపై ఉన్న గుండంలో నీళ్లు ఉండడం విశేషం. ఇక్కడ స్వామివారిని దర్శించుకున్న భక్తులు శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శించుకున్నట్లుగా భావిస్తారు. శివరాత్రి రోజు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, హోమాలకు ఈ ఆలయం ప్రసిద్ధి.



ఆహ్లాదకరం.. త్రిపురాంతకేశ్వరాలయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనుంతల గేటు సమీపంలోని అయ్యసాగర్ శ్రీ వీరభద్ర స్వామి ఆలయం ఆహ్లాదమైన వాతావరణంలో దినదినాభివృద్ధి చెందుతూ ప్రముఖ పుణ్య క్షేత్రం, పర్యాటక ప్రాంతంగా బాసిల్లుతుంది. ఎత్తైన కొండల నడుమ, అటవీ ప్రాంతంలో ఈ ఆలయం ఉంది. మునులు ఇక్కడ తపస్సు చేసినట్లు చరిత్ర చెబుతుంది. వార్షిక బ్రహ్మోత్సవాలతోపాటు వివిధ సందర్భాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు. గుట్టపై వీరభద్ర స్వామి ఆలయానికి విశాలమైన రోడ్డు నిర్మాణం చేపట్టారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి భక్తులు వస్తారు.

మైసిగండి శివాలయంలో ప్రత్యేక పూజలు



మైసిగండి శివాలయంలో పూజల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, తదితరులు

కడ్తాల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మండలంలోని మైసిగండి శివరామాలయంలో శ్రీకాశీవిశ్వనాథ స్వామి మహాశివ రాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు కొనసాగే వేడుకలకు ఆలయాన్ని అందగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాలను ఈఓ స్నేహలతతో కలిసి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ ప్రారంభించారు. మైసిగండి శివ, రామాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న మొక్కలు నాటారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవతో కాశీవిశ్వనాథ స్వామికి మేలుకొలుపు పాడారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌ను అలంకరించి అర్చకులు అమూల్యపతి, భానుప్రకాశ్, నాగేంద్ర శర్మ విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహనం, రుద్రాభిషేకం, గణపతిహోమం, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు భాస్కర్‌వాగ్దేవి దంపతుల ఆధ్వర్యంలో హోమం, గణపతిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు రామావత్ పాండు నాయక్, రాజారాం, నిర్వాహకుడు రామావత్ భాస్కర్, తహసీల్దార్ ఆర్‌పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో అంబురామేశ్వరుడు



పెద్దేముల్ మండలంలోని తట్టేపల్లి అంబరామేశ్వర ఆలయం వద్ద భక్తుల సందడి

పెద్దేముల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టెపల్లి, పాషాపూర్ గ్రామాల మధ్యగల దట్టమైన అటవీప్రాంతంలో దశాబ్దల చరిత్ర కలిగిన అంబురామేశ్వర దేవాలయం ఉంది. పచ్చని చెట్లు, నిత్యం ప్రవహించే సెలయేరు, ప్రకృతి రమనీయమైన అందాలు చూపరులను ఆకట్టుకుంటాయి. ఆలయం వద్ద లోయలోకి వేళ్లే ముందు పైన మనకు ఒక్కచుక్క నీరు కూడా కనిపించదు. కానీ, లోయలోని దేవాలయం వద్దకు చేరుకోగానే గలగల పారుతున్న సేలయేరు కనిపిస్తుంది. శ్రీరాముడు నడయాడాడని, స్వయంగా శివలింగాన్ని స్థాపించాడని చరిత్ర ఉంది. ఇక్కడ పాండవులు వనవాసం చేసే సమయంలో ఇక్కడి లోయలోని జమ్మిచెట్టుపై వారి అంబులు(ఆయుధాలు) దాచిపెట్టినట్లు చెపుతుంటారు. అందుకే ఈ ఆలయానికి అంబురామేశ్వర దేవాలయం అని పేరువచ్చినట్లు పూర్వీకులు అంటున్నారు. శివరాత్రికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.



భక్తుల ఇష్ట దైవం.. బుగ్గ రామలింగేశ్వరాలయం

వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతపద్మనాభ స్వామి ఆలయం, మల్లికార్జున ఆలయం, రామ మందిరం, వేంకటేశ్వర స్వామి దేవాలయంతోపాటు నియోజకవర్గంలోని వెల్‌చాల్ లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయం, ఎన్కతల శనైశ్వర ఆలయం, పులుసుమామిడి పార్వతీ పరమేశ్వరుని గుట్ట వేడుకలకు సిద్ధమయ్యాయి.



రాముడు ప్రతిష్ఠించిన శివలింగం

తాండూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయం త్రేతాయుగంలో వెలిసినది. ఈ ఆలయంలో లింగాన్ని శ్రీరాముడు ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతుంది. అక్కన్న మదన్నలు ఈ ఆలయాన్ని సందర్శించారు. శ్రీరామచంద్రుడు తండ్రి మాటతో రాజ్యాన్ని వీడి మునీశ్వరుల ఆశ్రమ సందర్శనలో నిమనగ్నమయ్యారు. వారి ఆశీర్వాదంతో ముక్కోటి లింగాలను స్థాపించినట్లు వాల్మీకి, రామాయణపు కథల్లో ఉంది. ఆ ముక్కోటి లింగాల్లో కోటేశ్వర లింగమొకటి.

'త్రివేణి సంగమం'.. సంగమేశ్వరాలయం



యాలాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మూడు నదుల కలయిక ప్రాంతమైన యాలాల మండలం సంగెంకుర్దు సమీపంలోని సంగమేశ్వర ఆలయం శివరాత్రి ఉత్సవాకు ముస్తాబైంది. నాలుగు శతాబ్దాలుగా భక్తుల పూజలందుకుంటున్నది. ఆదివారం పౌర్ణమిన త్రివేణి సంగమంలో స్నానం ఆచరిస్తే పాపాలు పోతాయని భక్తుల నమ్మకం. శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు.

చికెన్ పకోడి, గుడ్లు ఉచిత పంపిణీ



చికెన్‌పకోడీ, గుడ్లు పంచుతున్న చికెన్‌సెంటర్ నిర్వాహకులు

కులకచర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చౌరస్తాలో చికెన్ సెంటర్ నిర్వాహకులు మంగళవారం చికెన్ పకోడి, ఉడికించిన గుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కోళ్లను, వాటి గుడ్లను తినడం ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చికెన్, గుడ్లు తిన్నా ఎలాంటి వ్యాధి సోకదని అవగాహన కల్పించేందుకు ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు బాలాజీనాయక్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, వెన్‌కాట్ సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.



నెర్రెలు బారిన రోడ్డుకు మరమ్మతులు

హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

కేశంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం- వేముల్‌నర్వ రోడ్డులో నెర్రెలు బారిన రోడ్డుపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత డిసెంబర్ 29న వచ్చిన వార్త కథనానికి అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. నెర్రలు బారిన రోడ్డును పూర్తిగా తొలిగించి, అక్కడ నూతనంగా బీటీ వేశారు. రోడ్డును బాగు చేయడం పట్ల వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. సంగెం- వేముల్‌నర్వ గ్రామల మధ్య మిగిలిపోయన రోడ్డును పూర్తి చేస్తున్నారు. వేముల్‌నర్వ గ్రామంలో సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే వేముల్‌నర్వ నుంచి సంగెం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్





రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

చేవెళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ అధికారి(జెడ్పీసీఈవో) కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న పంచాయతీ బోర్లను అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు. జిలాలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. అధికారులు, గ్రామ కార్యదర్శులు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, సూపరింటెండ్ రవీందర్ ఉన్నారు.

మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు

వికారాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. మార్చి 2 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు 29 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలకు 16439 మంది విద్యార్థులు హాజరు హాజరవుతారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో 7914 విద్యార్థులు ఉండగా ఇందులో జనరల్ 6418, వృత్తి విద్యలో 1496 మంది పరీక్షలు ఉన్నట్లు వివరించారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 6963మంది విద్యార్థులుండగా 5589 మంది జనరల్ కాగా 1374మంది వృత్తి విద్య కోర్సుకు సంబంధించిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం ప్రైవేట్ విద్యార్థులు జనరల్‌కు సంబంధించి 1562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఫత్తేపురం బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు



పాడైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని తీగలవాగు బ్రిడ్జి, ఫత్తేపురం బ్రిడ్జిలతోపాటు పాడైన రోడ్డును రోడ్డు భవనాల శాఖ అధికారులతో కలిసి శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ వెంకటేషం మంగళవారం పరిశీలించారు. గుంతలమయమైన ఫత్తేపురం బ్రిడ్జితోపాటు అసంపూర్తి పనులతో నిలిచిన తీగలవాగు బ్రిడ్జితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ వెంకటేషం రోడ్డు భవనాల శాఖ డీఈ రమేష్ దృష్టికి తెచ్చారు. ఫత్తేపురం బ్రిడ్జిపై పనుల కోసం టెండర్ పనులు పూర్తి అయ్యాయని, మరో 15రోజుల్లో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. శంకర్‌పల్లి - ఫత్తేపురం నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం శిలాఫలకం వేయగా, కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయక పోవడంతో టెండర్ రద్దు చేశామని డీఈ వివరించారు. త్వరలో టెండర్ వేసి మిగిలిన పనులు సైతం సకాలంలో పూర్తి చేస్తామని చెప్పారు. తీగలవాగు వద్ద పాగైన రోడ్డును 200మీటర్ల మేర మున్సిపల్ నిధులతో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని కమిషనర్ తెలిపారు. ఆర్అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

- ఉరేసుకున్న స్థితిలో తల్లీకొడుకు మృతి
- మృతుడి భార్యపై స్థానికుల అనుమానం
- బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో ఘటన



అడ్డుకుంటున్న బంధువులు, స్థానికులు

బషీరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తల్లీకొడుకు మృతి చెందారు. ఇంట్లో దూలానికి ఇద్దరూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరినీ ఎవరో హత్య చేసి ఉరేసుకున్నట్లు వేలాడదిశారని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. బషీరాబాద్ మండలం కాశీంపూర్‌లో మంగళవారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటన మిస్టరీగా మారింది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కాశీంపూర్‌నకు చెందిన మాల ఎల్లమ్మ(54), ఆమె కుమారుడు మొగులప్ప(35), కోడలు రేణుక, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. ఎల్లమ్మ వ్యవసాయ కూలీకాగా, మొగులప్ప పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మొగలప్ప భార్య రేణుక కూడా కూలి పనులు చేస్తోంది. కాగా, దంపతుల మధ్య తరుచూ జీతం డబ్బుల విషయంలో గొడవలు జరిగేవని గ్రామస్థులు తెలిపారు. ఇటీవల పంచాయతీలో జీతం రాగా డబ్బుల విషయమై గొడవ జరుగగా, రేణుక రెండు రోజుల కిందట భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తల్లీకొడుకు కుంగిపోయి ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లీకొడుకు మృతిచెందిన రోజు చిన్నారి బాలుడు నందకిషోర్‌తో కలిసి ఒకే గదిలో నిద్రించారు. రేణుక, కూతురు వెన్నెలతో మరో గదిలో నిద్రించినట్లు పోలీసు విచారణలో తేలింది. తెల్లవారుజామున నందకిషోర్ రోదించగా గది తెరిచి చూడగా ఇద్దరు దూలానికి వేలాడుతూ కన్పించారని రేణుక పోలీసులకు తెలిపింది. అయితే రేణుక ప్రవర్తన సరిగా లేదని, ఆమె వల్లే ఇద్దరూ చనిపోయారని కొందరు మహిళలు ఆమెను చితకబాదారు. వారిబారి నుంచి పోలీసులు రేణుకను రక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మొగులప్ప ప్యాంట్ నుంచి రక్తం కారడం గమనించారు. దీంతో వారి బంధువులు తల్లీకొడుకును చంపారని ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. రేణుకకు వివాహేతర సంబంధాలున్నాయని, అందరూ కలిసి హత్య చేసి ఉండొచ్చని ఆరోపించారు.

తాండూరు ఆస్పత్రిలో పోస్టుమార్టం

రూరల్ సీఐ నగేశ్, క్రైం పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టంకు సహకరించాలని సీఐ సముదాయించారు. ఎవరిపైనైనా అనుమానం ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. చివరకు మృతదేహాలను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. కాగా బంధువు నర్సమ్మ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఆమనగల్లు : హోమంలో భక్తులు

ఆమనగల్లు/కడ్తాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగర క్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ దేవాలయాల్లో 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు, మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు, శివకోటి జప యజ్ఞం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం శివకోటి జపయజ్ఞం, పూర్ణాహుతి, శివగీత, భగద్గీత పారాయణయాలు, భజనలు నిర్వహించారు. నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, ఎన్.టి పంచాక్షరి, రామ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ అన్నారు. కడ్తాల మండలం మక్తమాదారంలో శివస్వాములు మహాపడి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఎంపీటీసీ మంజులచంద్రమౌళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగ ప్రతిష్ఠ వేడుకలు

తలకొండపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తలకొండపల్లి మండలం చెన్నారం సమీపంలోని మల్లప్ప గుట్టపై గల శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. రెండవ రోజు మంగళవారం గణపతి పూజ, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, శివగీత, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు కల్లు వెంటారెడ్డి, శేఖర్‌రెడ్డి, పాండయ్య, దామోదర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ధ్వజారోహణం

మహేశ్వరం : చారిత్రాత్మకమైన మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనము, ధ్వజారోహణ పూజలతో మొదలయ్యాయి. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. నేడు(బుధవారం) మహాశివరాత్రి పురస్కరించుకొని వేలాదిగా భక్తులు తరలివస్తుండడంతో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. మంగళవారం ధ్వజారోహణం నిర్వహించగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ చైర్మన్ నవీన్, కాకి కుమార్, డైరెక్టర్లు ఎం.రాఖేష్, శంకర్, నరేష్, తిరుపతయ్య, సాయిలు, శ్రీశైలం, సువర్ణ, నాయకులు పూర్ణ చంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జి. జంగయ్య, భిక్షపతి, సత్యనారాయణ, కె.చందు, మల్లేష్, మైసయ్య, శ్రీకాంత్, ఆలయ ఈవో మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేషం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గం.. విశ్వశాంతికి దోహదం

తలకొండపల్లి : భారతీయుల దైవ, ఆధ్యాత్మిక మార్గం విశ్వశాంతికి దోహద పడుతుందని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. మండల కేంద్రంలోని నర్సింహస్వామి గుట్టవద్ద నూతనంగా నిర్మించిన శివాలయ ప్రారంభ ఆహ్వాన పత్రికను మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆచారికి హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి అందజేశారు. బుధవారం నిర్వహించే శివపార్వతుల కళ్యాణం, ఆలయ ప్రారంభకార్యక్రమానికి రావాలని కోరారు. ఆలయ ప్రారంభకార్యక్రమానికి నేడు నాగసాధువులు హాజరవుతున్నట్లు నిర్వాహకుడు ఉప్పల వెంకటేశ్ తెలిపారు. అదేవిదంగా ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి అందజేశారు. మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌చ సర్పంచ్ లలితజ్యోతయ్య, ట్రస్ట్ సభ్యులు శ్రీశైలం గౌడ్, బుచ్చిబాబు, టిప్పుసుల్తాన్ తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మహేశ్వరం : ఐదు రోజుల పాటు మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో నిర్వమించబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అ న్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మొత్తం 250 మం ది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని ఆలయానికి వచ్చే భక్తులు ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసుల సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు భక్తులు, ఆలయ కమిటీ సహకరించాలన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : శివపార్వతుల కల్యాణోత్సవంలో భక్తులు, తాళి చూపిస్తున్న అర్చకుడు

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో గల శ్రీ వీరాంజనేయ సహస్ర లింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. మంగళవారం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరైనారు. పూజారికి గౌరవ వేతనం ఇప్పించాలని, ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఆలయ కమిటీ కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ కౌన్సిలర్లు మహేశ్వరి, ప్రతాప్‌రెడ్డి, బచ్చల నర్సింహ, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, మాధవులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు బహూకరణ

షాద్‌నగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని శివాలయానికి నందిగామ మండంలోని చేగూరుకు చెందిన అంజయ్యగౌడ్ దంపతులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సమక్షంలో మంగళవారం పూజారులకు విగ్రహాలను అందజేశారు. తాను కోరిన కోర్కెలు తీరడంతో స్వామికి ఉత్సవ విగ్రహాలను చేయించినట్లు అంజయ్యగౌడ్ తెలిపారు. పట్టణ ప్రముఖులు పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, టి. ప్రతాప్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, రాం భూపాల్, ఆలయ పూజారులు శ్రీనివాసాచార్యులు, శివలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

శంకర్‌పల్లి : దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని శంకర్‌పల్లి వీరాంజనేయ దేవాలయ కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డి తెలిపారు. శంకర్‌పల్లిలోని వీరాంజనేయ దేవాలయ అభివృద్ధికి చందిప్ప గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రూ.30వేల విరాళం దేవాలయ కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డికి మంగళవారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు గుండా శేఖర్, నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం



యేసురత్నం

యాచారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తిలో వ్యక్తి అదృశ్యమైనట్లు హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు తెలిపారు. ఏపీలోని ప్రకాశం జిల్లా తారులువాడు మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన యేసురత్నం(40) రెండేళ్లక్రితం ఉపాధి నిమిత్తం వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. తన తల్లి ఆరోగ్యం బాగా లేదని గ్రామంలో చెప్పి డిసెంబరు 8న సొంతూరికి వెళ్లాడని.. ఇంత వరకు అతని జాడ తెలియడం రాలేదని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712662726, 8712662725, 8712662724 నెంబర్లకు సమాచారమందించాలన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

● డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు

● టిప్పర్, హిటాచీ సీజ్

చౌదరిగూడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో ప్రభుత్వ అసైన్డ్ భూముల నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్, హిటాచీలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఈమేరకు మంగళవారం కొందుర్గు పోలీసులు వివరాలు వెల్లడించారు. శ్రీరంగాపూర్ శివారులోని సర్వేనంబరు 74లో అసైన్డ్ భూమిలోంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ రమేష్‌కుమార్ ఆదేశాలతో పోలీసులు వెళ్లి చూడగా మట్టిని లోడ్ చేస్తుండగా.. హిటాచీ, టిప్పర్‌ను గుర్తించారు. ఈమేరకు టిప్పర్ డ్రైవర్ అయోధ్యపూర్‌తండాకు చెందిన సతీష్, హిటాచీ డ్రైవర్ నాని లఖన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఐ శివకుమార్ ఫిర్యాదుతో వాహనాలను సీజ్ చేసి యజమానులు అంజిరెడ్డి, శంకర్, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ శ్రీరాంనగర్ కాలనీలో ఇంటి బయట పార్కు చేసి ఉన్న బైకును గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు కథనం మేరకు.. గరిగె రవీందర్ శ్రీరాంగనర్ కాలనీలో బంధువుల ఇంటి ముందు సీటీబీపీ మోటార్ సైకిల్ (నెం.టీఎస్-08 ఈహెచ్ 1800)ను సోమవారం ఉదయం పది గంటల సమయంలో పార్కుచేసి ఇంట్లోకి వెళ్లాడు. తిరిగి బయటకు వచ్చేసరికి కనిపించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఈమేరకు మంగళవారం నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను పచ్చటి మామిడి తోరణాలు, రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. కాగా, షాద్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి నేడు రామేశ్వరాలయానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.



యాచారం : విద్యుద్దీపాల వెలుగులో నందివనపర్తిలోని నందీశ్వరాలయం



కొత్తూర్ : ముస్తాబైన శ్రీకాశీ విశ్వనాథస్వామి దేవాలయం



షాద్‌నగర్ రూరల్ : పుణ్య స్నానాలకు సిద్ధం చేసిన రామేశ్వరాలయం కోనేరు



శంషాబాద్ : పండ్ల విక్రయాలు ఇలా..



చేవెళ్ల : విద్యుద్దీపాల వెలుగులో కొనగట్టు శివాలయం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



బైరంపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చౌదరిగూడ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందర్గు మండల పరిధిలోని బైరంపల్లి, మహాదేవ్‌పూర్‌లో రూ. 24 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఉత్తరాస్‌పల్లి నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై బహుమతులు అందజేశారు. విన్నర్ జట్టుకు పురుషోత్తం రెడ్డి రూ.25వేలు, రన్నర్‌కు జితేందర్ రెడ్డి, రూ.10వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. కాంగ్రె మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జితేందర్‌రెడ్డి, జమ్మృద్‌ఖాన్, ఇబ్రహీం, రవికుమార్, సాయిరెడ్డి, దామోదర్, రామకృష్ణ, శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్‌గౌడ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రామేశ్వరాలయ పవిత్రతను కాపాడాలి

● మత్తు పదార్థాలు, మాంసం విక్రయించొద్దు

● అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవాలి : హైకోర్టు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తర రామేశ్వరంగా ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వరుడి పవిత్రతను అపవిత్రం చేయొద్దని హైకోర్టు ఆదేశించింది. ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరంలో గల రామలింగేశ్వరుడిని శ్రీరాముడు ప్రతిష్ఠించాడని ప్రతీతి. సీతాన్వేషణకు వెళ్లి వస్తూ దండకారణ్య ప్రాంతమైన రామేశ్వరంలో శివ లింగాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేసినట్టు మాణిక్యప్రభు చరిత్రలో రాయబడింది. ఎంతో పవిత్రత కల్గిన రామేశ్వరం నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంది. ఎంతో గొప్ప చరిత్ర, పవిత్ర కల్గిన రామేశ్వరం పుణ్య క్షేత్రంలో మహా శివరాత్రిని పురష్కరించుకుని బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వేలాదిగా వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని కొందరు ఆలయ పరిసరాల్లో మద్యం, కల్లు, గుట్కా, మాంసం విక్రయాలను అక్రమంగా కొనసాగిస్తూ, ఆలయ పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ఈ విషయమై దేవాదాయశాఖ, ఎక్సైజ్‌శాఖలకు ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో వార్త కథనాలు వచ్చినా, మద్యం, కల్లు, మాంసం విక్రయాలు కొనసాగడాన్ని అరికట్టాలని రాయికల్ గ్రామ నివాసి, ఆలయ కమిటీ మాజీ సభ్యుడు మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దాంతో ఆలయ పరిసరాల్లో ఎలాంటి మద్యం, మత్తు పదార్థాలు, మాంసం విక్రయాలను కొనసాగకుండా ఎక్సైజ్, దేవాదాయ, పోలీసు శాఖలు చర్యలు తీసుకోవాలని మంగళవారం న్యాయమూర్తి జె. నాగేష్ భీమపాక ఆదేశాలు జారీ చేశారు. అక్రమ వ్యాపారాలతో ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని భక్తుల మనోభావాలను కాపాడాలని హైకోర్టు ఆదేశించడం ఎంతో ఆనందంగా ఉందని మోహన్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు దేవాదాయ, ఎక్సైజ్, పోలీసు శాఖలు స్పందించాలని కోరారు.

'ఉపాధి' పనులు ప్రారంభించాలి

తలకొండపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. కూలీలకు 200రోజులు పని కల్పించి రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న అవినాష్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పీఆర్ఆర్ మినీ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జడల రాజేందర్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకట్‌యాదవ్, మహేష్‌యాదవ్, రమేష్‌యాదవ్, శ్రీరాం రెడ్డి, ధనుంజయ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

● చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల తహసీల్దార్ బి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం కమ్మెట రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 270లో గల రెండెకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని నిర్మించుకున్న ప్రీకాస్ట్‌ను రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో తొలగించారు. ఈమేరకు అక్కడ ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, ఎస్సై

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): ప్రజా రక్షణలో ప్రాణాలొడ్డిన పోలీసు అమర వీరుల కుటుంబాలకు ప్రజలంతా అండగా నిలిచి మనోధైర్యం కల్పించాలని, వారి త్యాగాలు మరువలేనివని ఆమనగల్లు ఎస్సై వెంకటేశ్ కోరారు. కర్తవ్య నిర్వాహణలో అసువులుబాసిన దివంగత ఆమనగల్లు ఎస్సై కాసం హన్మంత్‌రెడ్డి 24వ వర్ధంతిని మంగళవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. హన్మంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది, హన్మంత్‌రెడ్డి సోదరుడు కాసం రాంరెడ్డిలతో కలిసి ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సై సీతారామ్‌రెడ్డి, ఏఎస్ఐలు బాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి కుటుంబసభ్యులు ముత్యాల సాయిబాబా, జ్యోతి, లక్ష్మి, దయాకిరణ్, ప్రణయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సర్వేనంబర్ 53లో కడీలను పూర్తిగా తొలగించాలి

కేశంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బైర్కాన్‌పల్లి శివారులోని సర్వే నెంబర్ 53లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి యత్నించిన విషయం విదితమే. మంగళవారం ఆర్ఐ నివేదిత సిబ్బందితో వెళ్లి ప్రభుత్వ స్థలంలో పాతిన కడీలను రోడ్డు వైపు తొలిగించారు. అయితే, రోడ్డువైపు మాత్రమే కాకుండా మొత్తం కడీలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

యాచారం సీఐగా నందీశ్వర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



యాచారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యాచారం సీఐగా నందీశ్వర్ రెడ్డి సోమవారం రాత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మల్కాజిగిరి సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్టేషన్‌లో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని నందివనపర్తి, తక్కళ్లపల్లి గుట్టపై బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

మహేశ్వరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అవేర్ సంస్థ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పేదలు వినియోగించుకోవాలని మాణిక్యమ్మగూడ మాజీ సర్పంచ్ మాసారం చంద్రయ్యగౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో శిబిరం నిర్వహించారు. సుమారు 96 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. వైద్యులు సౌమ్య, దేవిక, అవేర్‌సంస్థ కార్యనిర్వహణాధికారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



ఎల్వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా ఉండి ఆదుకుంటానని, ఆపదలో ఉన్నవారు తనను నేరుగా కలిసి ఇబ్బందులు తెలిపితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. యాచారం మండలంలోని మాల్‌కు చెందిన మహేశ్వరి కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్యం కోసం లక్షల్లో డబ్బు అవసరమవుతుందని వైద్యులు తెలిపారు. దాంతో పాండు తన కుమార్తె వ్యాధి గురించి మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను కలిసి గోడు వెల్లబోసుకున్నాడు. దాంతో తక్షణమే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.6లక్షల ఎల్వోసీ ఇప్పించారు. నాయకులు పడకంటి శేఖర్, జహంగీర్, రాజిరెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

ఊరి మధ్య నుంచి విద్యుత్ లైన్ వేయొద్దు

కొత్తూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల గ్రామం నుంచి కొడిచర్ల సబ్‌స్టేషన్ వరకు వేస్తున్న 33/11కేవీ విద్యుత్ నూతన లైన్ ఊరు మధ్య నుంచి వేయొద్దని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఏఈ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. నూతన విద్యుత్ లైన్‌ను పెంజర్ల ప్రధాన రోడ్డు నుంచి వేసేందుకు గోతుల తవ్వి స్తంభాలు అమర్చేందుకు విద్యుత్ సిబ్బంది సిద్ధమయ్యారు. గమనించిన గ్రామస్తులు ఏఈకి వినతిపత్రం ఇచ్చారు. 60ఇళ్ల యాజమానులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఊరి బయటి నుంచి లైన్ వేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



ఇంద్రారెడ్డినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని నాన్‌చెరు, ఇంద్రారెడ్డినగర్, ఖానాపూర్, రేగడిఘనాపూర్ తదితర గ్రామాల్లో రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, నర్సింలు, గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

స్పౌజ్ బదిలీ అక్రమాలను వెలికితీయాలి

● 317 జీవోకు విరుద్ధంగా బదిలీలు

● ఎస్ఏవీటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రవి



ఆదిభట్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ చేపట్టిన స్పౌజ్ బదిలీ కేటాయింపుల్లో అవకతవకలను, అక్రమ పోస్టింగ్స్‌ను రద్దు చేసి 317 జీవోకు విరుద్ధంగా జరిగిన అవినీతిని వెలికితీయాలని ఎస్ఏవీటీ(సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ టీచర్స్) సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బొడ్డు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని విద్యాశాఖలో 317 జీవోకు విరుద్ధంగా బదిలీలు జరిగాయని, జిల్లాలోని తలకొండపల్లి, అబ్దుల్లాపూర్, ఇబ్రహీంపట్నంలోని పలు స్కూళ్లలో స్పౌజ్‌కు విరుద్ధంగా బదిలీపై వచ్చారన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జడ్పీహెచ్ తొర్రూర్ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు లేవని, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు స్పౌజ్ పోస్టులతో భర్తీ చేశారని పేర్కొన్నారు. గతంలో జరిగిన రేషనలైజేషన్ వల్ల ఇక్కడి పాఠశాలలోని పోస్టులు వేరే పాఠశాలకు బదిలీ అయ్యాయని, దీంతో ఆ స్కూళ్లో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్స్ జరిగాయన్నారు. తలకొండపల్లి, కడ్తాల్, ఇబ్రహీంపట్నం మండలంలోనే ఇదేవిధంగా బదిలీలు జరిగాయని, పోస్టింగ్ లేని పాఠశాలలో స్పౌజ్ పోస్టింగ్స్ నింపి 24 శాతం హెచ్ఆర్ ఇస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరంలో జరిగిన బదిలీల్లో, ప్రమోషన్లలో పాఠశాలలో ఖాళీలు లేవని చూపి, అదే పాఠశాలలో స్పౌజ్ కింద పోస్టులు భర్తీ చేయడం చూస్తే రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో భారీఎత్తున అక్రమాలు జరిగాయని, ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.